మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

## గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో కలెక్టర్ ఆదర్శ్ సురభి సమీక్ష

**వనపర్తి ప్రతినిధి ఆగష్టు 23 ప్రభాతవార్త :** మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మహిళా శక్తి పై గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వనపర్తి జిల్లాలోని స్వయం సహాయ మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కల్పించడంతో పాటు సేవా రంగంలో పనిచేసే విధంగా కొత్త కొత్త వ్యాపారాల అవకాశాలు కల్పించాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిని ఆదేశించారు.పట్టణంలోని క్యాంటీన్ ఏర్పాటు, పిజా హట్, మహిళలకు మోడ్రన్ జిమ్, స్పోర్ట్స్ షాప్, బ్యూటీ పార్లర్ హబ్ వంటివి నెలకొల్పేవిధంగా ఆసక్తిని కలిగించి అందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇప్పించాలని సూచించారు. వనపర్తి పట్టణంలోని మహిళా సాధికారతకు చాల అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, డి.పి.యం అరుణ, అడిషనల్ డి.ఆర్.డి.ఓ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

# జూరాలకు పెరిగిన వరద

- 16గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- నారాయణపూర్ జలాశయం నుంచి 6వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో



జూరాల నుంచి శ్రీశైలానికి విడుదలవుతున్న నీరు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 23, ప్రభాతవార్త:** కృష్ణా పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులకు వరద పెరిగింది. ఎగున నుంచి జూరాల డ్యాంకు వరద నీరు వచ్చి చేరుతున్నది. శుక్రవారం జూరాలకు సాయంత్రం 6గంటల వరకు అందిన సమాచారం మేరకు 89,000 క్యూసెక్కుల వరద చేరగా 16గేట్లు ఎత్తి స్పిల్ వే ద్వారా 66,112క్యూసెక్కులు, పవర్ హౌజ్ ద్వారా 35వేల655క్యూసెక్కులు దిగువకు వదిలారు. జూరాలలో పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 9.132టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లోని విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. మధ్యాహ్నం వరకు 20గేట్ల ద్వారా నీటిని దిగువకు వదిలారు. జూరాల ఎడమ కాలువకు 550క్యూసెక్కులు, కుడి కాలువకు 500, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100, నెట్టెంపాడుకు 1500, కోయిల్‌సాగర్‌కు 630క్యూసెక్కులు విడుదల చేశారు. జూరాల నుంచి మొత్తంగా 1,05,042 క్యూసెక్కులు అవట్‌ఫ్లో నమోదైంది. కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టులకు జలకళ సంతరించుకున్నది. సాయంత్రం 6గంటల సమాచారం మేరకు ప్రాజెక్టుకు 30,000క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా 6,000 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదు అయింది. ప్రాజెక్టు నీటిమట్టం 492.25మీ. 33.313టీఎంసీలు కాగా ప్రస్తుతం 491.88మీటర్లు, 31.59టీఎంసీల నీట్టిమట్టం ఉన్నది.

### నేడు ఆర్ఓఆర్ చట్టంపై

# అవగాహన సదస్సు

### గద్వాల కలెక్టర్ సంతోష్



కలెక్టర్ సంతోష్

**గద్వాల, ఆగష్టు 23 ప్రభాతవార్త:** నూతనంగా ఏర్పాటు చేయనున్న రెవెన్యూ యాక్టు ఆర్ఓఆర్ చట్టం 2024 పై అభిప్రాయ సేకరణ కొరకు జిల్లాలోని మేధావులు, సీనియర్ సిటిజెన్లతో శుక్రవారం నిర్వహించతలపెట్టిన సమావేశం అనివార్య అకారణాల వల్ల శనివారం మధ్యాహ్నం 4 గంటలకు మార్చబడినదని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని మేధావులు, సీనియర్ సిటిజన్‌లు తదితరులు అందరూ గమనించగలరని తెలుపుతూ, ఇదే సమావేశాన్ని శనివారం సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశంలో సీనియర్ సిటిజన్‌లు, మేధావులు, రైతు సంఘాల సభ్యులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, రిటైర్డు రెవెన్యూ అధికారులు హాజరై తమ అమూల్యమైన సూచనలు, సలహాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# డీసీసీబీ 'హస్త'గతం

- మహబూబ్‌నగర్ చైర్మన్‌గా మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఏకగ్రీవం
- సీఎం రేవంత్‌రెడ్డి ఇలాఖాలో కాంగ్రెస్ ఖాతాలోకి మరోపదవి
- నామినేషన్ ఒక్కరే వేయడంతో ఏకగ్రీవంగా ప్రకటన
- డీసీసీబీ వద్ద కొల్లాపూర్ కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు
- రైతులకు అండగా ఉంటా : మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 23, ప్రభాతవార్త:** సీఎం రేవంత్‌రెడ్డి ఇలాఖాలో కాంగ్రెస్ ఖాతాలోకి మరో కీలక పదవి చేరింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నేత, పాన్‌గల్ పీఏసీఎస్ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీసీసీబీ చైర్మన్ చిట్యాల నిజాం పాషా అనారోగ్యం కారణంగా గత నెల రాజీనామా చేయడంతో ప్రస్తుతం చైర్మన్ ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఈక్రమంలో శుక్రవారం ఎన్నిక నిర్వహించగా ఎవరు నామినేషన్ వేయకపోవడంతో మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి టైటాస్‌పాల్ ప్రకటించారు. నాలుగేండ్ల కిందట డీసీసీబీలో మొత్తం 15మంది డైరెక్టర్లకుగానూ బీఆర్ఎస్ 13స్థానాలు గెలుచుకొని డీసీసీబీ చైర్మన్ పదవి కైవసం చేసుకున్నది. అనారోగ్యం కారణంగా నిజాంపాషా చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక ఏర్పడిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల అనంతరం చాలా మంది డైరెక్టర్లు కాంగ్రెస్ వైపు వెళ్లిపోయారు. ఈక్రమంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికలో మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం అయింది. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ఎవరూ నామినేషన్ వేడయకపోవడంతో మామిళ్లపల్లి ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు అధికారి ప్రకటించారు. 11మంది డైరెక్టర్లు ఎన్నికల ప్రక్రియకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి మధుసూదన్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి,వాకిటి శ్రీహరి, జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డికి ఏకగ్రీవ ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి టైటస్‌పాల్

**రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా : మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి**



మీడియాతో మాట్లాడుతున్న చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని డీసీసీబీ పరంగా అన్ని సేవలు అందుబాటులోకి తెస్తామని మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఏకగ్రీవం అనంతరం ఆయన ఎమ్మెల్యేలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. తన గెలుపులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి చైర్మన్ పదవి దక్కడానికి కారణం అయినా సీఎం రేవంత్‌రెడ్డి,మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

## అపరిశుభ్రతపై అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆగ్రహం



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**కొత్తకోట ఆగష్టు 23 ప్రభాతవార్త :** సీజనల్ కాలంలో పట్టణ మున్సిపాలిటీ సిబ్బంది పారిశ్ధ్యం పై దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శుక్రవారం కొత్తకోట పట్టణంలోని డ్రైడే సందర్భంగా పలు వార్డులను పరిశీలించారు. మున్సిపాలిటీలో 13,15 వార్డులలో రోడ్లపై ఉన్న చెత్తచెదరాన్ని చూసి మున్సిపాలిటీ కమిషనర్, సిబ్బందిపై ఆగ్రం వక్తం చేశారు. పట్టణంలోని రోడ్లపై మురికి నీరు చెరడంతో పారిశుద్ధ్య సమస్య, దోమల బెడదతో డెంగీ జ్వరాలు వ్యాప్తి చెంది వ్యాధులు వచ్చే అవకాశాలున్న వాటిపై దృష్టి సారించలేక పోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలో 40,000 జనాభా ఉన్న కొన్ని నెలల నుండి ఫాగింగ్ మిషన్ లేక ప్రజలు దోమల వల్ల జ్వరాలు వస్తున్నాయని నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపాలిటీ వారికి ఎన్నిసార్లు చెప్పినా సమస్యల పైన స్పందించిన దాఖలాలేవి కనిపించడం లేదని కేవలం తూతూ మంత్రంగా మొక్కుబడి చర్యలతో సరిపెట్టుకుంటూ దారుణంగా విఫలమవుతున్నారని ఇప్పటికైనా మున్సిపాలిటీ నిద్ర మేల్కొని పారిశుద్ధ్యం పై దోమల నివారణ పై తక్షణ చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్యనారాయణ, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మిషేక్, వేముల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తానే చంపేసి.. అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేసి..

- పుట్టింటి నుంచి డబ్బులు తేవడంలేదంటూ భార్యను కడతేర్చిన భర్త
- జడ్చర్లలో ఆలస్యంగా వెలుగులోకి..



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐలు, ఎస్సైలు

**జడ్చర్ల,ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఆస్తి పంపకాలకు సంబంధించి పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలంటూ నిత్యం భార్యను వేదిస్తూ చివరకు కట్టుకున్న భార్యను కడతేర్చారు. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల మండలం కిష్టారం గ్రామానికి చెందిన జంగారెడ్డి, పోలెపల్లి సెజ్‌లోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. కాగా గత కొంత కాలంగా పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలంటూ తన భార్య అనిత (45)ను వేధించేవాడు. అయితే తాను చెప్పింది వినట్లేదని కోపంతో భార్యను హత్యచేసి పోలెపల్లి శివారులోని లెదర్ పార్క్ వద్ద ఉన్న డంపింగ్ యార్డులో పడేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. అనితకు ఒక చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్లు ఉండగా ఓ తమ్ముడికి తన పెద్ద కూతురు శ్వేతతో వివాహం జరిపించింది. తన తల్లి దండ్రుల ఆస్తి పంపకాల్లో చెల్లి ఇద్దరు తమ్ముండ్లు వాటాలు తీసుకొని అనితకు ఇవ్వలేదు. ఇదే విషయమై జంగిరెడ్డి తన భార్య కుటుంబ సభ్యులతోని పంచాయితీ పెట్టుకిని ఆస్తిలో భాగం ఇవ్వాలని పట్టుబట్టాడు. ఇందుకు అనిత ససేమిరా అనడంతో కోపం పెంచుకొని అనితను చంపేందుకు పథకం రచించాడు. ఇందులో భాగంగానే ఈనెల 16న గంగాపూర్‌లోని చెన్నకేశవస్వామి ఆలయానికి తన భార్యను తీసుకెళ్లిన జంగిరెడ్డి తిరుగు ప్రయాణంలో పథకం ప్రకారం పోలెపల్లి శివారులోని లెదర్ పార్క్‌లో గుంత వద్దకు తీసుకెళ్లి అక్కడే ఉన్న వైరుతో గొంతు నులిమి చంపే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న కుక్కలు అరవడంతో తన ప్రయత్నాన్ని విరమించుకున్నాడు. ఇదే విషయమై అనిత తన పెద్ద కూతురు శ్వేతకు ఫోన్ ద్వారా తెలిపింది. జంగిరెడ్డి – మిగతా4లో..

# దేవర చెరువు పరిసర ప్రాంతంలో మొసలి..!



మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వెనుక దేవర చెరువు పరిసర ప్రాంతాలలో మొసలి సంచరిస్తుందని విషయం తెలుసుకున్నరైతులు, దేవస్థానం వారు పోలీసు, రెవెన్యూ , అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో స్పందించిన అధికార యంత్రాంగం శుక్రవారం ఆరు గంటలు శ్రమించి సురక్షితంగా పట్టుకుని తరలించారు.

*- మల్దకల్ ఆగష్టు 23, ప్రభాతవార్త*

# ఘనంగా బోనాల ఉత్సవాలు

## కర్రెమ్మ పోచమ్మ దేవతలకు బోనాలతో నైవేద్యం సమర్పించిన భక్తులు

## గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి రూరల్ ఆగష్టు 23 ప్రభాతవార్త :** ప్రతి సంవత్సరం ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించే కర్రెమ్మ పోచమ్మ బోనాల వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఐదు 18 19 20 21 వ వార్డుల ప్రజలు శుక్రవారం కర్రెమ్మ పోచమ్మ గ్రామ దేవతలకు బోనాలతో నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సాయంకాలం పట్టణంలోని 21 వ వార్డులో గల గల్లి నుంచి పోచమ్మ దేవతకు గుడి పూజారులు పెద్ద బోనంతో ఊరేగింపుగా వచ్చి వాడలో కొలువైన కర్రెమ్మ గుడిలో నైవేద్యం సమర్పించారు. అనంతరం కర్రెమ్మ దేవతకు ప్రజలు వాడవాడ నుంచి పెద్ద ఎత్తున బోనం ఎత్తి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డప్పు వాయించి భక్తులలో ఉషారు రేకెత్తించారు. ఇదే సందర్భంలో కాలనీ మహిళలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఒక్కరి ఇంట్లో సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు కాకులోరం భరత్ భూషణ్ , ద్యారపోగు రాజు, గంధం ట్రాక్టర్ చిన్న బాలయ్య, గడ్డం కృష్ణయ్య, గంధం నాగరాజు, బంకలి సుబ్రహ్మణ్యం, జిఎన్ విజయ్, కంట్రోల్ రాములు, గంధం కొండలయ్య, ద్యారపోగు జయరాములు, గంధం చెన్నయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ , వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, శంకర్ ప్రసాద్, కౌన్సిలర్ బాపనపల్లి వెంకటేష్, చందర్, మార్కెట్ డైరెక్టర్ సూరి, ద్యారపోవు సఫాయి శేఖర్, సురేందర్, కొమ్ము టిల్లు పాల్గొన్నారు.

# మళ్లీ మంచి రోజులు వచ్చాయి..

- 6 గ్యారంటీలు అమలు చేస్తాం
- మహిళా సంక్షేమానికి పెద్దపీట
- తలకు మించిన భారంగా గత పాలకుల అప్పులు
- కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి




చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగష్టు 23 ప్రభాత వార్త :** తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు మంచి రోజులు వచ్చాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలానికి చెందిన 100 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట – మిగతా4లో..

# కాలువలకు మరమ్మతు చేపట్టాలి

## జూరాల, నెట్టెంపాడు కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే బండ్ల



కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల,ఆగష్టు 23 ప్రభాతవార్త:** భారీ వర్షాల కారణంగా పాతపాలెం, నీలహళ్లి గ్రామాలలో రహదారి తెగిపోవడంతో, రాకపోకలు నిలిచిపోయాయి. తెగిన కాలువలను వెంటనే మరమ్మతు చేయాలని అధికారులను ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. గద్వాల – మిగతా4లో..

## ఎక్స్‌గ్రేషియా చెక్కుల పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ

**వనపర్తి ప్రతినిధి ఆగష్టు 23 ప్రభాతవార్త :** ఆకస్మికంగా మరణించిన సివిల్ హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, హెచ్‌సి 1918 కుటుంబానికి పోలీస్ భద్రత నుండి మంజూరైన 8,00,000/ చెక్కును, రోడ్డు ప్రమాదంలో మరణించిన శివకుమార్ ఆర్ పిసి 2806, కు పర్సనల్ ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ 5,100,00/- చెక్‌ను, రోడ్డు ప్రమాదంలో చనిపోయిన సివిల్ పిసి 3195 బాలరాజు కుటుంబానికి, 1,00,000/-చెక్కు లను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపిఎస్ వారివారి కుటుంబాలకు చెక్కులను శుక్రవారం అందజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మరణించిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్ కుటుంబాల స్థితిగతులపై ఆరా తీయడంతో పాటు, శాఖపరంగా రావల్సిన బెనిఫిట్లను అందజేసేందుకు తక్షణ చర్యలు గైకొనాల్సిందిగా ఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వరరావు ఆర్ఐ శ్రీనివాస్, సెక్షన్ క్లర్క్ ప్రశాంత్ పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

## బోనాల సందర్భంగా వడివడిగా పనులు..!!

**-పనుల్ని పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్**

**భూత్పూర్,ఆగష్టు 23,ప్రభాతవార్త :** ప్రతీ ఏటా శ్రావణ మాసం చివరి మంగళవారం రోజున ఎంతో వైభవంగా నిర్వహించే పోచమ్మ అమ్మ వారి బోనాల పండుగను భూత్పూంలో ఈ నెల 27న మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ శుక్రవారం గ్రామశివారులో ఉన్న పోచమ్మగుడి పరిసరలాను మున్సిపల్ సిబ్బంధితో దగ్గరుండి పరిశుభ్రం చేయించారు. చెత్త చెదారాలను తొలగింపజేసి,ముళ్లకంపచెట్లను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని పలువార్డులలో వీధిలైట్లను ఏర్పాటు చేసేందుకు సంబంధిత సిబ్బంధికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పాటు చైర్మన్ స్వయంగా పనులను పర్యవేక్షించారు.చైర్మన్ వెంట బీఆర్ఎస్ నాయకుడు,మండల గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు గడ్డం యాదయ్య ఉన్నారు.



పోచమ్మ గుడి వద్ద పరిసరాలను దగ్గరుండి శుభ్రం చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్

## మహిళా జర్నలిస్టుపై దాడిని ఖండించిన జర్నలిస్టులు

**పెబ్బేరు ఆగష్టు 23 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టు సరిత, విజయరెడ్డిలపై జరిగిన దాడిని పెబ్బేరు ప్రెస్ క్లబ్ సభ్యులు తీవ్రంగా ఖండించారు. ప్రశ్నించే వారిని గొంతు నొక్కడం సరికాదని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేసే మీడియా జర్నలిస్టులపై దాడి చేయడం సరికాదని, ఇలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జి.బాలవర్ధన్ డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు బాలరాజు, ప్రధాన కార్యదర్శి పరుశరాములు, ఉపాధ్యాక్షుడు కిరణ్ కుమార్ గౌడ్, భాష, నాగరాములు, రమేశ్, రాము, ఎద్దుల రాము తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న పెబ్బేరు జర్నలిస్టులు

## ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలి

**మక్తల్ టౌన్,ఆగష్టు 23 ప్రభాతవార్త :** మక్తల్ పరిధిలోని గార్లపల్లి గ్రామానికి ఆర్టీసి బస్సులేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక మంది విద్యార్థులు ప్రతిరోజు కాలినడకన వెళ్లి పాఠశాలకు హాజరై తిరిగి వస్తున్న సమయంలో వర్షాలు, గాలి వీస్తున్నా కూడా అలాగే ప్రయాణిస్తూ రోడ్డుపై నడుచుకుంటూ విద్యార్థులు పాఠశాలకు హాజరవుతున్నారు. ఇంతకు ముందు ఆర్టీసి అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన కానీ ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ఎలాగైనా ఆర్టీసి బస్సుసౌకర్యం కల్పిస్తే మక్తల్ నుండి గ్రామానికి వెళ్లే విద్యార్థులకు రాకపోకలకు ప్రయాణం సులువుగా అవుతుందని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల సంఖ్య దాదాపు 40 మందికి పైగా ఉంటుందని విద్యార్థినీ, విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మాకు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.



కాలినడకన పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినీలు

## తంగడి గ్రామంలో తాగునీటి సమస్య

**కృష్ణ, ఆగష్టు 23 ప్రభాతవార్త :** గత వారం రోజులుగా కృష్ణా మండలం తంగిడి గ్రామంలో మంచినీటి సరఫరా జరగడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో తాగునీటి కోసం ప్రధానంగా ఉన్న బోరుబావి చెడిపోయి పదిరోజులవుతున్నా దాని మరమ్మతులు చేయించకుండా చూసి చూడనట్లు గ్రామ కార్యదర్శి, అధికారులు వ్యవహరిస్తున్నారని, గ్రామంలో మంచినీటి ట్యాంక్‌ను కడగమని విన్నవించుకున్నా పట్టించుకునే వారే లేరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్‌గా ఉన్న నీటి ట్యాంకులో పక్షుల వ్యర్థాలు, వర్షం వచ్చినప్పుడు నులిపురుగులు నీటిలో వస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి కొరకు చేతి పంపులే ఆధారమయ్యాయని అవి చెడిపోతే నీరు లేకుండా పోతాయని మిషన్ భగీరథ నీరు ఇప్పటివరకు మా గ్రామానికి అసలే రావడం లేదని తెలిపారు. వర్షాకాలంలోనే ఇంతగా తాగునీటి సమస్య ఉంటే రానున్నరోజుల్లో ఎంత ఇబ్బంది పడాల్సి వస్తుందోనని గ్రామస్తులు భయపడుతున్నారు. గ్రామం పక్కనే కృష్ణ, బీమా రెండునదులు పారుతున్నా తాగునీటి కొరకు సుదూరప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నామని మా సమస్యపై ఏనాయకుడు స్పందించడంలేదని వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తీర్చాలని విన్నవించారు.



ఖాళీ బిందెలతో మహిళలు


## పీయూలో జాతీయ అంతరిక్ష దినోత్సవం

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగష్టు 23 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీలో భౌతికశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విభాగాధిపతి డా. కె. ప్రవీణ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో అగ్రదేశాల సరసన భారతదేశం నిలిచిందని, చంద్రయాన్ 3 విజయాన్ని అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవడం మనందరికి గర్వకారణమని, సిఎల్ఐఆర్, జెఆర్ఎఫ్‌లలో అర్హత సాధించడం ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాలలో పరిశోధనలు చేయవచ్చని అన్నారు. అనంతరం పిజి విద్యార్థులకు అంతరిక్ష రంగంలో ఆవిష్కరణలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులను రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో డా. శ్రీనివాసులు, చెన్నయ్య, కె. రవికుమార్ పాల్గొన్నారు.



పోటీలు నిర్వహిస్తున్న ప్రొ॥ ప్రవీణ

**నారాయణపేట టౌన్,ఆగష్టు 23 ప్రభాతవార్త :** పట్టణంలోని హంసవాహిని ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. అదే విధంగా గత ఏడాది శ్రీహరికోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్ 3 ప్రయోగాన్ని విద్యార్థులు ప్రొజెక్టర్ సహాయంతో వీక్షించారు. సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. చిన్నతనం నుంచే అంతరిక్షంపై అభిరుచి కలిగి ఉండాలని, నూతన ప్రయోగాలు చేసేలా ప్రోత్సాహం పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేష్‌కుమార్, సైన్స్ టీచర్ నమ్రత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సింలు, తిరుపతి, రేవతి, భారతి తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థినులు లక్ష్యం వైపుకు అడుగులు వేయాలి...

- మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు
- మహిళ ఆరోగ్యం రక్షణకు మానవతా ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయం...
- అడిషనల్ ఎస్పీ, జిల్లా మహిళా రక్షణ విభాగం ఇన్‌చార్జి రామేశ్వర్

**కల్వకుర్తి, ఆగస్టు 23 ప్రభాతవార్త:** విద్యార్థినులు జీవితంలో ఉన్నతంగా రాణించేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా అడిషనల్ ఎస్పీ, మహిళా రక్షణ విభాగం ఇన్‌చార్జి రామేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మానవత ఫౌండేసన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళల నెలసరి సమస్యలు, రక్షణ కార్యక్రమాన్ని ఆయన స్థానిక డీఎస్పీ వెంకటేశ్వర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు ఒంటరిగా వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. పాఠశాలలో పనిచేసే ప్రదేశాల్లో మనకు తెలిసిన వాళ్లు, తెలియని వారితో జాగ్రత్తగా మెలుగాలన్నారు. ఇతరుల ప్రవర్తనలో ఏ మాత్రం అనుమానం వచ్చిన జాగ్రత్తలు తీసుకుంటేనే జన సంచారం ఉన్న ప్రదేశాలకు వెళ్లిపోవాలన్నారు. అమ్మాయిలు అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని, పాఠశాలల్లో ఉపాధ్యాయురాళ్లతో పాటు ఇండ్ల వద్ద తల్లిదండ్రులు తమ పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలన్నారు. మహిళలు, విద్యార్థినులు, యువతులను రక్షించేందుకు షీ టీంలు ఉన్నాయన్నారు. అనంతరం మానవత ఫౌండేసన్ లోగో ఆవిష్కరణ చేసి మహిళల ఆరోగ్య రక్షణ పట్ల మానవతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ చేపట్టారు. మహిళల ఆరోగ్య రక్షణ పట్ల మానవత ఫౌండేషన్ చూపుతున్న చొరవను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగర్జున, ఎస్ఐ మాధవరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు నిర్మల, షీ టీం ఇన్‌చార్జి విజయలక్ష్మి, వెంకటయ్య, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ



మానవత ఫౌండేషన్ లోగో ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

## రైతన్నలు లేకుండానే ధర్నాలు...!

**రుణమాఫీపై బిఆర్ఎస్ మాట్లాడడం సిగ్గుచేటు.. డిసిసి ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు**

**బిజినేపల్లి,ఆగష్టు 23 ప్రభాతవార్త :** రైతన్నలు లేకుండానే బిఆర్ఎస్ రుణమాఫీ ధర్నాలు చేసి మాట్లాడడం సిగ్గుచేటని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు బంగారి పర్వతాలు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. బంగారి పర్వతాలు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ పదేళ్లుగా అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల రైతాంగం అప్పుల పాలు కావాల్సి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ప్రజల మన్ననలను పొందిందన్నారు. తెలంగాణ రైతాంగం యావత్ బ్యాంకుల్లో రుణమాఫీ చేసుకుంటూ ఉంటే టిఆర్ఎస్ నాయకత్వం తమ ఉనికి కోసం రైతుల పేరుతో డ్రామాలాడుతున్నారని అన్నారు. రైతుల స్పందనలు లేని నిరసనలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఆదివాసి రాష్ట్ర సెక్రెటరీ వాల్యానాయక్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుచ్చన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బంగారి పర్వతాలు

## విద్యాలయాలు పరిశుభ్రతతోనే విద్యార్థుల ఆరోగ్య భద్రత

**అమరచింత ఆగష్టు 23 ప్రభాతవార్త :** విద్యాలయాలు పరిశుభ్రతతోనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్ అన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా కస్తూర్బా విద్యాలయంలో పాఠశాల గదులను అధికారులు శుభ్రపరిచారు. అలాగే విద్యార్థినిలకు అందిస్తున్న వంటి సామాగ్రిని వంటగదిని పరిశీలించారు. వర్షాకాలం సీజన్ వ్యాధులు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా విద్యార్థినిల గదులకు పిచికారి చేయించారు. మరుగుదొడ్ల మూత్రశాలలో దోమలు ఈగలు పడకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు కంటి, టైఫాయిడ్, మలేరియా, వైద్యులు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ఎలాంటి రోగాల బారిన పడకుండా తమ గదులను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రతి విద్యార్థి పరిశుభ్రతను పాటించాలని వైద్యులు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నూరల్ నజీబ్ డాక్టర్ నిస్సార్ అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



కస్తూర్బా పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న అధికారులు

## పెబ్బేరు పట్టణ పరిధి అంబేద్కర్ నగర్‌లో ఫ్రైడే డ్రైడే

**పెబ్బేర్ ఆగష్టు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెబ్బేరు పట్టణ పరిధిలోని 1వ వార్డు అంబేద్కర్ నగర్‌లో డ్రైడే ఫ్రైడే సీజనల్ వ్యాదుల పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయినాథ్ మాట్లాడుతూ దోమలు గుడ్లు పెట్టకుండా నీళ్ళు నిలువ ఉండకుండా చూసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షకాలం దృష్ట్యా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక విషజ్వరాలు వచ్చే అవకాశం ఉన్నాయి కాబట్టి ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించలన్నారు. అనంతరం వనమహోత్సవం సందర్భంగా వార్డు ప్రజలకు పూల, పళ్ల మొక్కలను పంచి, మొక్కలను తీసుకోవడమే కాకుండా వాటిని నాటి పెంచే బాధ్యత కూడా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అదిశేషు, మేనేజర్ గణేష్ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరినాథ్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ భూరణ్, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, వార్డు ఆఫీసర్‌లు ఉమావతి, శిరీష, రాములమ్మ, రుక్మిణీ, బాలిశ్వరమ్మ, సునీత, ఎన్వి రాన్మెంటల్ ఇంజనీరు యోగేష్ కుమార్, ఎఎన్ఎం లు, ఆశవర్కర్ లు, పట్టణ ప్రజాప్రతినిధులు, ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

## అంటువ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలి మున్సిపల్ చైర్మన్

**ఆత్మకూర్ ఆగష్టు 23 ప్రభాతవార్త :** ప్రస్తుత వర్షాకాల సీజన్లో అంటువ్యా ధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంటువ్యాధులను దరిచేరనీ యకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆత్మకూర్ మున్సిప ల్ చైర్పర్సన్ గాయత్రీ రవికుమార్ యాదవ్ మున్సిపల్ కమిషనర్ నాగరా జు తదితరులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రోజు ఫ్రైడే సందర్భంగా మున్సి పల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని మూడు నాలుగో వార్డులలో కలియ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. అంటువ్యాధుల బారి న పడకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటూ కరపత్రాల ద్వారా కమిష నర్ చైర్ పర్సన్ ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ప్రతి శుక్రవారం ఫ్రైడే కార్యక్రమాన్ని ప్రజల సద్వినియోగం చేసుకొని నిలువ నీటిని పారబోసి ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. మున్సిపల్ కేంద్రంలో మున్సిపల్ సిబ్బంది చేస్తున్న స్వచ్ఛదనం పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. మూడు నాలుగవ వార్డులలోని మురుగు కాలువల శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ ను చల్లించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తో పాటుగా వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి కౌన్సిలర్లు మహేశ్వరి ,అశ్విని, కుమార్, రామకృష్ణ, తబసుం బేగం తదితరులతో పాటుగా మున్సిపల్ సిబ్బంది ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న చైర్మన్ , కమిషనర్

## బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

**- రుతుస్రావంపై అవగాహన కల్పించడం అవసరం... - మానవతా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమ్య**

**కల్వకుర్తి,ఆగస్టు 23 ప్రభాతవార్త:** కౌమరదశలో ఉన్న బాలికలు, మహిళల పునరోత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే క్రమంలో రుతుస్రావం జరుగుతుందని మానవతా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమ్య పేర్కొన్నారు. నేటి సమాజంలో రుతుస్రావం ఎన్నో అపోహలు ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు రుతుస్రావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ ప్రధానమైన అంశం కౌమరదశలో ఉన్న బాలికల్లో రుతుక్రమ ఆరోగ్యం మరియు పరిశుభ్రతకు సంబంధించిన అవగాహనను పెంచడం ఎంతైన అవసరమని ఆమె పేర్కొన్నారు. విద్యార్థినులు, కుటుంబాలకు దూరంగా ఉండి చదువుకుంటున్న మరియు ఇతర పనుల్లో ఉన్న యువతులు రుతుస్రావం గురించి జ్ఞానం పెంచుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఎందుకంటే వారి తల్లులు మరియు ఇతర మహిళలు వారితో సమస్యలను చర్చించడానికి దూరంగా ఉంటారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వయోజన స్త్రీలకు జీవసంబంధమైన వాస్తవాలు వ్యక్తిగత పరిశుభ్రమైన విషయాల పట్ల సరైన అవగాహన నేటికి లేదని, ఇది చాలా బాధకరమైన విషయమన్నారు. రుతుక్రమ సమయంలో మహిళలు, బాలికలు, యుక్త వయస్సు యువతులు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగర్జున, ఎస్ఐ మాధవరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు నిర్మల, షీ టీం ఇన్‌చార్జి విజయలక్ష్మి, వెంకటయ్య, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మానవతా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమ్య

## ఉపాధ్యాయులకు సన్మానం



**నారాయణపేట టౌన్,ఆగష్టు 23 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీ, ప్రమోషన్‌పై వేరే పాఠశాలకు వెళ్లిన లక్ష్మయ్య, శశిధర్ ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటి సభ్యులు, జిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సహజమే అన్నారు. బాధ్యతతో పని చేసిన ఉపాధ్యాయునికి ఏ గ్రామం వెళ్లిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ పాఠశాలలో అందరూ అభినందించే విధంగా పని చేశారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు



విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్,ఆగష్టు 23 ప్రభాతవార్త :** వరల్డ్ యూత్ డే సందర్భంగా శుక్రవారం పేట చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు లయన్స్ క్లబ్‌వారి ఆధ్వర్యంలో సమాజంలో యువత పాత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో టాప్ 10 మార్కులు సాధించి విజేతలు విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం లయన్స్ సుదర్శన్‌రెడ్డి, లయన్స్ రఘుబాబు, లయన్స్ క్లబ్ సెక్రెటరీ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు మాట్లాడారు.కార్యక్రమంలో మహేష్,లయన్స్‌క్లబ్ సెక్రెటరీ రామాంజనేయులు, లయన్ నంబర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వసంత, మాజీ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## భూత్పూర్ నాల్గోవార్డులో డ్రైడే..!!

**భూత్పూర్,ఆగష్టు 23,ప్రభాతవార్త :** వైద్యాధికారులు, ఉద్యోగులు,సిబ్బంధి ప్రతీ శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడేను భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీలోని నాల్గోవార్డు ఇందిరానగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ నాగమ్మ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంధి పరిశుభ్రతా చర్యలు చేపట్టారు.వార్డు కౌన్సిలర్‌తో పాటు స్థానిక నాయకులు గడ్డం యాదయ్య,భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి వేడుకలకు ముస్తాబైన వేణుగోపాలస్వామి దేవాలయం

**నారాయణపేట టౌన్,ఆగష్టు 23 ప్రభాతవార్త :** లోకాయపల్లి వేణుగోపాలస్వామి దేవాలయం కృష్ణాష్టమీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రంగులు వేసి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి అధ్యక్ష, కార్యదర్శులు బాలప్ప యాదవ్, భైరంకొండ నర్సింలు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ రాత్రి 12గం.లకు డోలారోహణ కార్యక్రమం,27వ తేదీ ఉదయం 10 గం.లకు గోపూజ, అన్నదానం, సాయంత్రం 5 గం.లకు ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## విద్యుదాఘానికి మహిళ మృతి..!!

**భూత్పూర్,ఆగష్టు 23,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్‌లో విద్యుదాఘాతానికి మహిళ మృతి చెందిన విషాదకర సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం అమిస్తాపూర్‌కు చెందిన కుర్వ కెండ్యాల చిన్నమ్మ(52) శుక్రవారం తన బాత్ రూం వద్ద తేలిఉన్న విద్యుత్ తీగల్ని గమనించ కుండా బాత్ రూం డోర్ తీసేందుకు వెళ్లి డోర్‌ను ముట్టుకోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. భర్త కుర్వ కెండ్యాల వెంకట్ రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుజరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## వసతిగృహాన్ని తనిఖీ చేసిన స్పెషలాఫీసర్



సరుకులను తనిఖీ చేస్తున్న దృశ్యం

**భూత్పూర్,ఆగష్టు 23,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ కేంద్రంలోని జిప్సీహోం వసతి గృహాన్ని భూత్పూర్ మండల స్పెషలాఫసర్ వేణుగోపాల్ నేతృత్వంలో ఎంపిడీఓ ప్రభాకర్‌చారి,ఏఈఈ రాజేంద్రకుమార్,ఐసీడీసీ సూపర్‌వైజర్ సుశీల ఇతర అధికారులు తనిఖీ నిర్వహించారు.హాస్టల్‌లో పాటిస్తున్న పరిశుభ్రత చర్యలు,నాణ్యతను వారు పరిశీలించారు.

## బస్సుల కోసం విద్యార్థుల ధర్నా



బస్సుల కోసం మస్తీపూర్ గ్రామంలో రోడ్డుపై విద్యార్థులు ధర్నా

**అమరచింత ఆగష్టు 23 ప్రభాతవార్త:** గద్వాల్ డిపో ఆర్టీసీ బస్సులు బందు కావడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా అధ్యక్షులు కే రాఘవ డిమాండ్ చేశారు. శుక్రవారం అమరచింత మండల పరిది లోని మస్తిపూర్ గ్రామంలో రోడ్డుపై విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గద్వాల్ బస్సులు ప్రతిరోజు పాఠశాల సమయవేళలకు బస్సు సౌకర్యం ఉండేదని ఇప్పుడు గద్వాల్ ఆర్టీసీ డిపో అధికారులు ఆత్మకూర్ అమరచింత వచ్చే బస్సులు పూర్తిగా రద్దవ్వడంతో నందిమల్ల కృష్ణంపల్లి మస్తీపూర్ చంద్రగడ్ గ్రామాల విద్యార్థులకు బస్సులు రద్దవ్వడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక ఇంటి దగ్గరే ఉంటున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని విద్యార్థుల చదువులు సాగే విధంగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సులు వెయ్యాలనిఆయన అధికారులను కోరారు.లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమ వుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమేష్, చరణ్, సందీప్, వినయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతు చేపట్టాలని ఆందోళన



గుంతలమయమైన రహదారి

**మక్తల్,ఆగష్టు 23 ప్రభాతవార్త:** మండలంలోని కాట్రేవ్‌పల్లి, రాయికోడ్ గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారి రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు పడు తున్నామని, తక్షణమే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ దండు సమీపం లో రైతులు, ప్రజలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులాఉన్న ఇటుక బట్టీలకు వెళ్లే లారీల వల్ల రెండు గ్రామాల కు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడి అస్తవ్యస్తంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింద న్నారు. ఇటుక బట్టీలకు వెళ్లే లారీలను అరికట్టి వెంటనే తమ గ్రామానికి వెళ్లే రహదారి మరమ్మతుల పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ప్రజలు, రైతులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. అసలే వర్షా కాలం కావడంతో పెద్ద పెద్ద బురద గుంతలు ఏర్పడ్డాయని, ఇక్కడ ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడంతో నిత్యం ఓవర్‌లోడ్‌తో లారీలు రావడం వల్ల ఉన్న కాస్త రోడ్డు కూడా పాడైపోయిందని తమ గ్రామానికి వెళ్లేందుకు నరకంగా ఉందని పలువురు రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సిపిఎస్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయుల నిరసన



సిపిఎస్‌ను రద్దు చేయాలని అమరచింత జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

**అమరచింత ఆగష్టు 23 ప్రభాతవార్త :** సిపిఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్ర వారం అమరచింత మండల కేంద్రం లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యా యులు బోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలి పారు. ఈ సంద ర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు యుటిఎఫ్ మండల కార్యదర్శి రాము మాట్లాడు తూ, ప్రభుత్వం ఎన్నికలలో సిపిఎస్ ను రద్దుచేసి ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని వారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు సంబంధించిన సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో విద్యుత్ లైన్‌మెన్ మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రవి

**అడ్డాకుల,ఆగష్టు 23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాటవరం గ్రామంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో స్థానిక లైన్‌మెన్ మునగాల రవి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గాయపడిన రవిని స్థానికులు హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు తెలిపారు. అడ్డాకుల సబ్ స్టేషన్‌లో డ్యూటీలో ఉన్న ముగ్గురు లైన్‌మెన్లు వెంకటేష్ గట్టప్ప,గోవిందులు కాంట్రాక్టు పద్ధతిలో ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌లో నియ మితులై ఉద్యోగం చేస్తున్నారు. రవి కాటారం గ్రామంలో విద్యు త్ సరఫరా ఆగిపోవడంతో లైన్‌మెన్ ఎం. రవి సబ్‌స్టేషన్ లైన్‌మెన్ గట్టప్పకు ఫోన్‌చేసి తిమ్మాయిపల్లికి ఎల్‌సి ఇవ్వమని అడిగాడు. గట్టప్ప అక్కడే ఉన్న లైన్‌మెన్ వెంకటేశ్‌కు విషయం చెప్పగా గుడిబండ గ్రామం లైన్ ఆఫ్ చేశాడు. తిమ్మాయిపల్లి గ్రామ విద్యుత్ సరఫరా నిలిపివే యలేదు. విషయం తెలియని ఎం. రవి గట్టప్పకు ఫోన్‌చేసి అడగగా అనాలోచిత నిర్ణయంతో తిమ్మాయిపల్లికి ఎల్‌సి ఇవ్వడం జరిగిందని తప్పు చెప్పా డు. లైన్‌మెన్ గట్టప్ప మాటలు నమ్మిన ఎ. రవి కరెంటు బంద్ అయిందని ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ ను ముట్టుకోగా షాక్‌తో తీవ్రంగా గాయ పడ్డాడు. హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి తరలించగా మర ణించడం జరిగింది. సంవత్సరం క్రితం పెళ్లయిన రవికి ఈ మధ్యనే ఒక కుమారుడు జన్మించాడు. అడ్డాకుల గ్రామంలో ఎం.రవి మరణించడంతోవిషాదఛాయలు నెలకొన్నాయి.సబ్ స్టేషన్‌లో ముగ్గురు లైన్‌మెన్‌లు గట్టప్ప, వెంకట ేష్, గోవింద నిర్లక్ష్యల వల్లే రవి చనిపోవడం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వీరిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

## విధి నిర్వహణలో మరణించిన రవి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా రూ. 50 లక్షలు చెల్లించాలి : సిఐటియు

**అడ్డాకుల,ఆగష్టు 23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాటవరం గ్రామంలో శుక్రవారం విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మరణించిన మునగలశెట్టి రవి (27) ఔట్‌సోర్సింగ్ వర్కర్ మండల కేంద్రానికి చెందిన రవి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సహకారం అందించాలని, సిఐటియు జిల్లా కమిటి ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. మునగల శెట్టి రవి తండ్రి యెసోప్ గత 12 ఏళ్లుగా విద్యుత్ సంస్థలో ఔట్‌సోర్సింగ్ వర్కర్‌గా పని చేస్తు న్నాడని వారు ముగ్గురు అన్నదమ్ములు. ఈయన పెద్దవాడు ఇతనిపైనే కుటుంబం మొత్తం ఆధా పడి జీవిస్తుందని, అతని భార్య సుమలత, 45 రోజుల బాబు ఉన్నాడని ఆయన మరణంతో కుటుంబం దిక్కులైనిదైందని, విద్యుత్ సంస్థ నుంచి రూ. 50 లక్షల ఆర్థిక అందించాలని, దహన సంస్కారాలకు రూ.50 వేలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని దళిత కార్మి కుడైన రవి కుటుంబానికి అన్ని విధాలా సహాయం అందించి ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో ఉన్న రవి మృతదేహాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కిల్లెగోపాల్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రవి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యుదాఘాతానికి గురై పాడి ఆవు మృతి



**నాగర్‌కర్నూల్‌ప్రతినిధి, ఆగస్టు 23 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత రవితేజ జూనియర్ కళాశాల వెనుక భాగంలో ఓ రైతు పొలంలో గురువారం రాత్రి గాలివానకు విద్యుత్ తీగ తెగిపడటంతో పాడి ఆవు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణానికి చెందిన నిరుపేద రైతు తిమ్మాజిపేట నరేందర్ రోజులాగే వ్యవసాయ పొలం వద్ద చెట్టు కింద ఆవులు కట్టేశారు. రాత్రి గాలివాన భీభత్సంతో చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ తీగలు తెగి ఆవు మీద పడటంతో ఆవు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినది. మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.1లక్ష వరకు ఉంటుందని, వారం రోజుల్లో ఆవు ఈనేదంటూ రైతు కన్నీరు మున్నీరుగా విలపించారు. పాడి ఆవుల మీద జీవనం కొనసాగిస్తున్న తనకు ప్రభుత్వం, విద్యుత్ శాఖ ద్వారా నష్ట పరిహారాన్ని అందించి ఆదుకోవాలని రైతు నరేందర్ కోరారు. ఈ సంఘటనపై స్థానిక తహసీల్దార్‌తో పాటు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

# క్రీడా పాలసీతో మహర్ధశ

### ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఖోఖో అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్



ఒబేదుల్లా కొత్వాల్‌ని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగష్టు 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే క్రీడా పాలసీతో తెలంగాణ రాష్ట్రంలోని క్రీడలకు క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు రానుందని మహబూబ నగర్ ఉమ్మడి జిల్లా ఖోఖో అధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టిఎన్‌జిఓ భవన్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తే రాష్ట్రస్థాయిలో జాతీయ స్థాయి లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని అన్నారు. ఖోఖో క్రీడకు సంబంధించి ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించడం జిల్లాకు గర్వకారణమని భవిష్యత్తులో కూడా క్రీడలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఆతిథ్యం ఇవ్వాల న్నారు. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ ఉంటుందని దానిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆ విధంగా క్రీడాకారులను ప్రోత్సహించాలని సంఘ సభ్యులకు సూచించారు. అనంతరం రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మన్‌గా ఎంపికైన జిల్లా అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్‌ని సంఘం పక్షాన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్య దర్శి జిఏ విలియం,సీనియర్ ఉపాధ్యక్షులు గోపాలం, శ్రీనివా సులు, బాలరాజు, దూమర్ల నిరంజన్, నిరంజన్ యాదవ్, రమేష్, మొగులాల్, ఆనంద్, వెంకటేష్,తులసి, రూప,నీలాబాయి, ఉమ్మడి జిల్లా వివిధ తాలూకాల బాధ్యులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్,ఆగష్టు 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 54,200 మంది మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కార్మికుల సమస్యలపై తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఇచ్చిన రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా విద్యాశాఖ అధికారికి కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 54,200ల మంది మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. గత పాలకులు కార్మికులను పట్టిం చుకోలేదని కట్టు బానిసల్లాగా వెట్టిచాకిరి చేస్తూ అనేక ఆందోళనలు, పోరాటాలు చేసినా ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆయన ఆరోపిం చారు. సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ. 10 వేలు వేతనం పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని వెంటనే అమల్లోకి తీసుకురావాలని ఆయ న విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. వంట పాత్రలు, కోడిగుడ్లు, సిలిండర్‌లు ప్రభుత్వమే సరఫరా చేయాల న్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ న్న, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు జమీర్, లక్ష్మి, చిన్న సాయమ్మ, భీమమ్మ, పెద్ద సాయమ్మ, రాములమ్మ, అనంతమ్మ పాల్గొన్నారు.

## పాడి పశువుల పోషణలో మహిళలు ముందంజలో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి డా.మధు

**తెల్కపల్లి,ఆగష్టు 23 ప్రభాతవార్త:** పాడి పశువుల పెంపకం పోషణలో మహిళలు ముందంజలో ఉండి లబ్ది పొందాలని మండల పశువైద్యాధికారి డా. మధు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని స్త్రీశక్తి భవనంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన స్వయం సహాయక సంఘంలోని సభ్యులకు సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా వారు పాల్గొని మాట్లాడుతూ పాల ఉత్పత్తి గురించి గేదెలు,ఆవులు పాలు ఎక్కువ ఇచ్చే జాతుల గురిం చి మహిళలకు వివరించారు. స్త్రీనిధి రుణాలు గేదెలకు, ఆవులకు రుణము రూ. 93,270 ఇస్తామని, ఇందులో 8 నుండి 10 లీటర్ల వరకు ఒక పూటకు గేదె కాని ఆవు పాలు ఇస్తుందని తెలిపారు. రూ.75 వేల చొప్పున కొనుగోలు చేయుటకు దానకు రూ.7200లు ట్రాన్స్‌పోర్టేషన్ రూ. 3 వేలు, ఇన్సూరెన్స్ చార్జి రూ. 5088, ట్రాన్సిస్టర్ ఇన్సూరెన్స్ రూ.443,షేర్ క్యాపిటల్ వచ్చేసి 2 శాతం రూ. 174 షేర్ క్యాపిటల్ రూ. 835 మొత్తం రూ. 93,270 లోను మంజూరు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ రుణమును 48నెలల్లోపూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. నెలకు వాయిదా రూ. 2200 చొప్పున చెల్లించవలసి ఉంటుందని అన్నారు. అవస రమైన మహిళలకు కొనుగోలు కోసం వేరే రాష్ట్రంలో కొనుగోలు చేయుటకు వెళ్లాల్సి వస్తుందని ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు కొనుగోలు చేసేందుకు అనుకూలంగా ఉంటుందని మహిళలు అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీఎంనిరంజన్, సిసిలునరసింహ, నిరంజన్,సుకునయ్య, సుజ ాత,నాగలక్ష్మి,రేణుక,భార్గవి,శివ,రజిత మండలంలోని పర్వతాపూర్, వట్టిపల్లి, తెల్కపల్లి, కారువంగ, బండపల్లి, దాస్‌పల్లి, పెద్దూరు, వట్టిపల్లి, తండా తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి




మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బలుముల ప్రేమ్‌కుమార్

**తెల్కపల్లి,ఆగష్టు 23 ప్రభాతవార్త:** కలకత్తా నగరంలో విధులు నిర్వ హిస్తున్న ట్రైనీ డాక్టర్‌పై సభ్య సమాజం తలదించుకునే విధంగా అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని న్యాయం జరిగే వరకు పోరాడుతామని నాగర్‌కర్నూల్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలుముల ప్రేమ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దేశమోని ఆంజనేయులు అన్నారు. శుక్రవారం తెల్కపల్లి మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి గ్రామంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యా ర్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ట్రైనీ డా. మౌమితపై అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కోరారు. ట్రైనీ వైద్య విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. అనం తరం గ్రామంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో మౌమిత మృతికి సంతా పంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేశమని ఆంజనేయులతో పాటు సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సూర్యశంకర్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నరేష్, సిపిఐ నరెందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సౌమ్య, ఆశా కార్యకర్తలు లక్ష్మి పాల్గొన్నారు.

# అధికారులకు, ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**రాజాపూర్,ఆగష్టు 23 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల పరిధిలోని ఇద్గాన్‌పల్లి గ్రామంలోని రైతువేదిక దగ్గర మండల వ్యవసాయ అధికారులకు, ఉపాధ్యాయులకు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘన సన్మానం కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ పిసిసి సోషల్ మీడియా కో ఆర్డినేటర్ శివకుమార్ ఏర్పాటు చేశారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పిసిసి సోషల్ మీడియా కో ఆర్డినేటర్ శివకుమార్, రాజాపూర్ మం డల వ్యవసాయ అధికారి నరెందర్, ఏఈఓ ఆంజనేయులు, పంచా యతీ కార్యదర్శిశివకుమార్, పాఠశాల ఉపాధ్యాయురాలు దుర్గాదేవి, మంజుల, బదిలీపై వెళుతున్న సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. నూతనంగా రాజాపూర్ మండలవ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ప్రదీప్‌కుమార్,పంచాయతీ కార్యదర్శి భానురాథోడ్, ఏఈఓ రమే ష్‌రెడ్డి స్వాగతం పలుకుతూ వారిని శాలువాలతో ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పిసిసి సోషల్ మీడియా కో ఆర్డినేటర్ శివకుమార్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా రాజాపూర్ మండల వ్యవసాయ అధికారిగా నరెందర్ రైతులకు తను చేసిన సేవలు వెలకట్టలేనివంటూ కొనియాడారు. ఏఈఓ ఆంజనేయులు,పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ప్రజలకు అందు బాటులో ఉంటూ గ్రామ అభివృద్ధి కొరకు గ్రామ పెద్దలతో అధికారు లతో కలిసి గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి తనవంతు సహాయ సహకారాలు అందించారన్నారు. ఉపాధ్యాయురాలు దుర్గాదేవి, మంజుల,విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వాసవీక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఆగష్టు 23 ప్రభాతవార్త:** వాసవీక్లబ్ జోన్ చైర్మన్ అఫిష యల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా వాసవీక్లబ్ కల్వకుర్తి ఆధ్వ ర్యంలో మండలంలోని తుర్కలపల్లి పాఠశాలలో శుక్రవారం విద్యా ర్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, కాంబాక్స్ బాక్స్‌లు, పెన్సిల్స్, స్కేల్స్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీక్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక, సహాయం, ప్రభుత్వ పాఠ శాలల్లో మంచి ట్యాంకులు ఇలా సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ జోన్ చైర్మన్ కూన సంతోష్, కల్వకుర్తి వాసవీక్లబ్ అధ్యక్షులు చిదిరే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కల్వ ఆంజనేయులు, కోశాధికారి దుగ్గి అశోక్‌కుమార్, క్లబ్ సభ్యులు రాఘవేందర్, ప్రధానోపాధ్యాయులు నారాయణరావు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## జిల్లా వ్యవసాయశాఖకు రెగ్యులర్ డిఏఓను నియమించాలి

**గద్వాల,ఆగష్టు 23 ప్రభాతవార్త :** జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని రెగ్యులర్ అధికారి నియమించారని జిల్లా రైతాంగ సమితి నాయ కులు కోరుతున్నారు. జిల్లాలో కాటన్ సీడ్ ఉత్పత్తి ఎంత జరుగు తుంది కాబట్టి ఇక్కడ రెగ్యులర్ డిఈఓ నియమించాలని రైతులు రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో సుమారు 60 వేల ఎకరాల్లో కాటన్ సీడ్ ఉత్పత్తి ఏడాది జరుగుతుందని కాబట్టి ఇక్కడ రెగ్యులర్ డిఈఓ ఉండాలని, ఇన్చార్జి డిఈఓ అవసరం లేదని రైతులు కోరుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 12 మండలాల పరిధిలో సుమారు 280 గ్రామా లలో 80 శాతం రైతులు వ్యవసాయం చేస్తారని, ఒక్కడ నిరక్ష రాస్య రైతులు ఎక్కవ మంది ఉన్నారని, ఇక్కడ నకిలీ సీడ్ మాఫీ యా ఎక్కువగా ఉందని, నకిలీ ఎరువులు, పెష్టి సైడ్స్ ఎక్కువ గా రైతుల కు అమ్మడం రైతులు నష్ట పోతున్నారని రైతులు, మేధా వులు, విద్యా వంతులు అంటున్నారు. గద్వాల , అలంపూర్ రెండు నియోజకవర్గాలలో సుమారు 4 లక్షల ఎకరాలలో రైతులు పంటలు పండి స్తున్నందున ఎంఏఓ లు,ఏఓలు రెగ్యులర్ ఏడిఏలు, డిఏఓ ఉండాలని రైతులు,రైతు సంఘాల ప్రతినిధులు మంత్రులు దామో దర్ రాజనర్సింహ, జూపల్లికృష్ణరావు, ఎంపీ మల్లు రవి, డీకే అరుణ, ఎమ్మెల్సీ చల్లా వెంకట్ రామి రెడ్డిలతో పాటు ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, విజయులు, మాజీ జడ్పిచైర్మన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమారును కోరుతున్నారు.

## నూతన డిసిసిబి చైర్మన్‌ను కలిసిన పెబ్బేరు పిఎసిఎస్ చైర్మన్

**పెబ్బేరు ఆగష్టు 23 ప్రభాతవార్త:** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నూతన చైర్మన్ గా వనపర్తి జిల్లాకు చెందిన మామిళ్లపల్లి విష్ణు వర్ధన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మెన్‌కు ఎన్నికల నిర్వహణ అధికారి టైటాన్స్ పాల్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెబ్బేరు పిఎసిఎస్ చైర్మన్ గౌని కోదండరామిరెడ్డి నూతనంగా ఎన్నికైన చైర్మెన్‌ను శుభా కాంక్షలు తెలియజేసి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఆయనకోరారు. పెబ్బేరు పిఎసిఎస్ చైర్మన్ గౌని కోదండ రామిరెడ్డి,పిఎసిఎస్ వెంకట్ రావు, రఘువర్ధన్ రెడ్డి, మధుసుదన్ రెడ్డి పాల్గొన్నారు.

## నిజాం వెన్నుల్లో వణుకు పుట్టించిన ధీరుడు షాహిద్ షోయబుల్లాఖాన్

**వనపర్తి టౌన్‌ఆగష్టు 23 ప్రభాతవార్త:** దేశం కోసం మరణి స్తునందుకు నాతో పాటు మీరు సంతోషించాలి అని చెప్పి వీరు డు సోయబుల్లాఖాన్ వనపర్తి జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ నగర్ లో పార్టీ కార్యాలయంలో సోయబుల్లాఖాన్ 76 వ ర్ధంతి నిర్వహించి ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యండి జబ్బర్ సోయబు ల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడు తూ మరణశయ్య మీదినుండి తల్లిదండ్రులకు, భార్యకు హిత బోధ చేయడం అనేది వీరులకే సాధ్యం హైదరాబాద్ సంస్థానం లోని దొరల,దేశ్ ముఖ్‌ల, రజాకార్ల ఆగాడాలను, నిజాం నిరం కుశ పాలనను సవాల్ చేస్తూ హైదరాబాద్ ఉస్మానియా యూని వర్సిటీ నుండి జర్నలిజంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. తెలంగాణ అగ్ని గోళంగా మండుతున్న కాలమది. భూస్వాముల, దొరల, దేశ్‌ముఖ్ ల రక్షసత్వాన్ని ఎదురిస్తూ హైదరాబాద్ సంసా నంలో రగల్ జెండాలు ఎత్తుకొని దోపిడి సాగదంటూ సామా న్యుడు సాయుధుడై సమరం సాగిస్తున్న రోజులవి. సరిగ్గా అప్పుడే గుండెల నిండా ప్రజాస్వామ్యకాంక్షతో, దుర్మర్గ పాలనను ఎదురించే చైతన్యంతో ఉస్మానియా క్యాంపస్ నుంచి సోయబు ల్లాఖాన్ డిగ్రీ పట్టా చేతపట్టుకొని బయటకొచ్చాడు. సోయాబు ల్లాఖాన్ అజ్ఞాత వ్యక్తుల నండి బెదిరింపు లేఖలు సాధారణమైన అలాంటి త్యాగమూర్తుల సందేశం నేడు దేశానికి ఎంతో అవసరం మత విశ్వాసాలకు అతీతంగా యువతీ, యువకులందరికి ఆయన ఆదర్శనీయుడ దేశంలో ప్రస్తుతం మతోన్మాద శక్తులు పెట్రేగి లౌకిక ప్రజాస్వామిక విలువలను సవాల్ చేస్తున్నాయి. తెలం గాణలో సోయబుల్లాఖాన్ వర్ధంతి సందర్భాన్ని కూడా మత విద్వే షాలు రెచ్చగొట్టేందుకుమతోన్మాదులువాడుకుంటున్నారు. కార్యక్ర మంలో ఆవాస్ జిల్లా కార్యదర్శి కాజా, రైతు సంఘం కార్యదర్శి బాల్‌రెడ్డి, ఐద్వాఉపాధ్యక్షురాలుఉమా,ఆశన్న, వెంకటస్వామి, రవి, నవీను కాజా , వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మేఘన్న అభయస్తం

**వనపర్తి టౌన్ ఆగష్టు 23 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలో హరిజనవాడ 21వ వార్డుకు చెందిన వెంకటమ్మ అనారోగ్యం బాగులేక మరణించడం జరిగింది. స్థానిక కౌన్సిలర్ బి వెంకటే శ్వర్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి సమాచారం ఇవ్వగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్ ద్వారా ఆర్థిక సాయం అందించారు. గంధం చిన్న బాల య్య మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సూరి కలిసి మరణించిన వెంకటమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. మరణించిన వెంకటమ్మ కుటుంబానికి 5000 రూపా యలు ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు.

## ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన మామిళ్ళ పల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానించిన బండ్ల బ్రదర్స్



**గద్వాల ఆగష్టు 23 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్ళ పల్లి విష్ణువర్ధన్ రెడ్డి ని జోగులాంబ గద్వాల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలు శుక్రవారం ఘనంగాసన్మానం చేశారు.ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

## పొడి చెత్త, తడి చెత్త వేర్వేరు చేయాలి

**కల్వకుర్తిటౌన్, ఆగస్టు23 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటి పరిధిలోని విద్యానగర్ కాలనీలో శుక్రవారం తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చెత్త బండికి సిబ్బందికి అందించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ కాలనీ వాసులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను ఒకే చోటుకు చేర్చడం వల్ల దోమలకు ఆవాసంగా మారడంతో పాటు అనారోగ్యానికి దారితీస్తుందన్నారు.కార్యక్రమంలో కాలనీవాసులు శంకర్‌నాయక్, బాలయ్య, రమాదేవి, చంద్రకళ, కళమ్మ, ఉషారాణి, అనురాధ, మున్సిపల్ సిబ్బంది స్వరాజ్యలక్ష్మి, శ్రీశైలం ఉన్నారు.



కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ

## ప్రశాంతంగా ముగిసిన పీజీ పరీక్షలు

### కేంద్రాలను తనిఖీ చేసిన పరీక్షల నియంత్రణ అధికారి రాజ్‌కుమార్



పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న రాజ్‌కుమార్

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 23 ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఏడు పరీక్ష కేంద్రాలో నాలుగవ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఎంఎస్‌సి రసాయనశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, సూక్ష్మ జీవశాస్త్రం, ఎంఎ తెలుగు, ఇంగ్లీష్, రాజనీతి శాస్త్రం, సామాజిక శాస్త్రం సబ్జెక్టులలో 4 సెమిస్టర్ పరీక్షలు జరిగాయి. పిజి కళాశాల పరీక్ష కేంద్రాన్ని,పరీక్షల నియంత్రణ అధికారి డా. రాజకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి, చూచిరాతలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు చీఫ్ సూపరింటెండెంట్ డా.ఎన్. చంద్రకిరణ్ ఉన్నారు. చీఫ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఈరోజు 461 మంది విద్యార్థులకు హాజరయ్యారని నలుగురు (4) విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. చివరి పరీక్ష ముగియడంతో విద్యార్థులు ఒకరికి ఒకరు అభివాదం చేసుకుంటూ కెరీర్‌పై కొత్త ఆశలతో బయలుదేరారు.

## ఘనంగా తాటిచెట్టు మైసమ్మ బోనాలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎర్రశేఖర్

**జడ్చర్ల టౌన్,ఆగస్టు 23, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీలోని నాలుగో వార్డులోని తాటిచెట్టు మైసమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. నిమ్మబావి గడ్డ నుంచి ఆలయం వరకు తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ,అన్నదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, నాయకులు పిట్టల మురళి, కరాటే శ్రీను, అడ్వకేట్ శివకుమార్, నిర్వాహకుడు సంతు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు చేయాలి

### ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించిన ప్రభుత్వ ఉద్యోగులు



ఎమ్మెల్యేను కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు 23 ప్రభాతవార్త :** 2004లో నాటి ప్రభుత్వం ఇచ్చిన జిఓ నంబర్ 28 ద్వారా నూతనంగా ఎంపికైన ప్రభుత్వ ఉద్యోగులు పెన్షన్ సౌకర్యం కోల్పోయారని, అందుకే గతంలో ప్రభుత్వం ఇచ్చిన జిఓను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు మహబూబ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి మీ సమస్య తీసుకువెళ్లి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు స్థిత ప్రజ్ఞ, శ్రీకాంత్, నరేష్‌గౌడ్, జిల్లా నాయకులు సనాతన బాలస్వామి, చంద్రకాంత్, రాఘవేందర్ పాల్గొన్నారు.

## కుర్ని సంక్షేమ సంఘం ఏకపక్ష విధానాలు

### ఎన్నికలు జరిగేలా చూడాలని ఆర్. కృష్ణయ్యను కోరిన సభ్యులు



ఆర్.కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న కుర్ని సంఘం అధ్యక్షుడు, సభ్యులు

**మహబూబ్‌నగర్,ఆగస్టు23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర కుర్ని సంక్షేమ సంఘంలో నియంతృత్వ పోకడలను నియంత్రించాలని కోరుతూ ఎంపి ఆర్.కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. బిసి చేనేత సామాజిక వర్గానికి చెందిన చేనేత వృత్తిగా ఉన్న కుర్ని (బిసి,బి క్రమ సంఖ్య 16) కులానికి సంబంధించి 2015లో తెలంగాణ రాష్ట్ర కుర్ని సంక్షేమ సంఘం పేరిట ఒక సంఘాన్ని ఏర్పాటు చేశారని, అయితే ఈ సంఘం బాధ్యులు కులంలోని పేదల సంక్షేమం పట్ల గాని, యువతకు మార్గనిర్దేశం చేసే అంశాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కుర్ని యువసేన రాష్ట్ర అధ్యక్షుడు కుర్ని శ్రీనివాసులుతో పాటు కార్యవర్గ సభ్యులు శంకర్, కిశోర్, రవికాంత్ తదితరులు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్యను హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం సమర్పించారు. కుర్ని సంక్షేమ సంఘం ఏకపక్ష విధానాలపై ఆర్.కృష్ణయ్య విస్మయం వ్యక్తం చేస్తూ బాధ్యులను పిలిపించి ఎన్నికలు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఎన్ఏఎస్ నిర్వహణపై దృష్టి కేంద్రీకరించండి

**మహబూబ్‌నగర్,ఆగస్టు 23 ప్రభాతవార్త :** నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) నిర్వహణపై దృష్టి సారించాలని మహబూబ్‌నగర్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్ సూచించారు. మహబూబ్‌నగర్ హౌసింగ్ బోర్డు ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా 3వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న నాస్ పరీక్ష గురించి విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈసారి జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఎన్ఎఎస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షపై ప్రతి ఒక్కరు దృష్టి కేంద్రీకరించి మూడు, ఆరవ, తొమ్మిదవ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సర్వేలో అడిగే ప్రశ్నల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

## డిసిసిబి చైర్మన్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు

**కోయిల్‌కొండ,ఆగస్టు 23 ప్రభాతవార్త:** నూతనంగా ఎంపికైన మహబూబ్‌నగర్ జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని శుక్రవారం జిల్లా కేంద్రంలో మండలంలోని సంగనోనిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మామిళ్ల పల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అందరికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని వారన్నారు. భవిష్యత్తులో విష్ణువర్ధ న్‌రెడ్డి ఇలాంటి మరెన్నో పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. డిసిసిబి చైర్మన్‌ని కలిసిన వారిలో నారాయణరెడ్డి, యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# రసవత్తరంగా యువజన కాంగ్రెస్ ఎన్నికలు

- ఉమ్మడి మండలంలోని గ్రూపులుగా ప్రచారం



**ఆత్మకూర్ ఆగస్టు 23 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గంలోని ఉమ్మడి ఆత్మకూరు మండలం యువజన కాంగ్రెస్ ఎన్నికలు ప్రచారం రసవత్తరంగా కొనసాగుతుంది రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 14 నుండి వచ్చే నెల 14 వరకు యువజన కాంగ్రెస్ ఎన్నికలు మండలాల వారీగా జరగనున్నాయి అందులో భాగంగానే ఆత్మకూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలకు ఏకంగా ఐదుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. అధ్యక్ష పదవి కోసం ప్రధానంగా మండలంలోని పిన్నంచర్ల గ్రామానికి చెందిన హరీష్ గౌడ్ కానాపురం గ్రామానికి చెందిన వంశీయులు పోటీ నెలకొనగా మిగతా ముగ్గురు భాస్కర్ రవి అశోక్ల సైతం తాము బరిలోనే ఉన్నామంటూ ప్రచారం కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆత్మకూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థులు బరిలో ఉన్న హరీష్ గౌడు నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి మద్దతుదారుడిగా వంశీ మాత్రం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి కల్లుగీత పారిశ్రామిక విభాగం చైర్మన్ నాగరాజు గౌడ్ మద్దతు దారుడిగా ప్రచారం కొనసాగిస్తున్నారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు మరోవైపు యోజన కాంగ్రెస్ నాయకులు మాత్రం తాము ఎవరికి మద్దతు తెలపాలో పాలు పోక తల పట్టుకుంటున్నారు. ఇప్పటికే మండలంలోని రేచింతల గ్రామంలో యువజన కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి సంబంధించి తాజా మాజీ ఎంపిటిసి సభ్యులు గ్రామ పార్టీ అధ్యక్షుల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం ఎలా ఉన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలిసింది ఏది ఏమూనప్పటికి ఆత్మకూరు మండల యువజన కాంగ్రెస్ ఎన్నికలు పోరు కొనసాగుతున్న నేపథ్యంలో మక్తల్ నియోజకవర్గం శాసన సభ్యులు వాకిటి శ్రీహరి మాత్రం ఎవరికి మాట ఇవ్వకపోవడం విశేషం అంతేకాకుండా ప్రశాంత్ కుమార్ రెడ్డి మద్దతు దారుడిగా కొనసాగుతున్న హరీష్ గౌడ్‌కు మాత్రం మండలంలోని ఆయా గ్రామాలలో ప్రశాంత్ కుమార్‌రెడ్డి తండ్రి వీరారెడ్డి శాసనసభ్యుడిగా పనిచేసిన సందర్భంలో ఉన్న పరిచయాలనేపథ్యం తదితర వాటిని అనుకులంగా మంచుకునేందుకు విశ్వప్రయత్నాలు కొనసాగిస్తుండగా నాగరాజుగౌడ్ మద్దతు దారుడుగా కొనసాగుతున్న వంశీ మాత్రం పార్టీ కోసం అహర్నిశలు పాటుపడుతున్న తనకే అవకాశం ఇవ్వాలంటూ నాయకులను ప్రాధేయపడుతున్నారు. ఉమ్మడి మండలంలోని యువజన కాంగ్రెస్ ఎన్నికల ప్రచారమైన కాంగ్రెస్ నాయకులు మాత్రం జీవించుకోలేక తాము ఎవరికి మద్దతు పలకడం లేదని ఈ అభ్యర్థి గెలిచిన తమ పార్టీకే మద్దతుదారిగా అవకాశం కల్పిస్తామని ఏకంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విలేకరుల సమావేశం పెట్టి ప్రకటించడం విశేషం.

## ఏడాదిగా పట్టించుకుంటలేరు..

- ఇండ్ల మధ్యే మురుగునీరు..
- దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నాం..
- కమిషనర్ సార్ మీరైనా పట్టించుకోండి



ఇండ్ల మధ్యే మురుగునీటి గుంత

**జడ్చర్ల, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఇండ్ల మధ్యే మురుగు నీరు కంపుకొడుతున్నది..సుమారు ఏడాదిగా ఇదే సమస్య ఉన్నా అధికారులు, కౌన్సిలర్ నామమాత్రంగా వచ్చి చూసి వెళ్తున్నారు తప్పా సమస్య పరిష్కారం కావడం లేదని జడ్చర్ల మున్సిపాలిటీ మూడో వార్డుకు చెందిన కాలనీవాసులు వాపోతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు వార్డు ఏబీసీ స్కూల్ లేన్‌లో ఇండ్ల మధ్యే గుంత ఏర్పడి మురుగునీరు చేరి దుర్గంధం చేరడంతో వాసన భరించలేకపోతున్నామని పేర్కొన్నారు. డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేసి నీటిని అందులోకి కలిపితే నీరు ఇండ్ల మధ్య ఆగదని సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలేదని చెబుతున్నారు. ఇటీవలే స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమం నిర్వహించినా సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ రాజయ్యకు ఫిర్యాదు చేసినట్లు కాలనీకి చెందిన శ్వేతారామ్ తెలిపారు. కమిషనర్ అందుబాటులో లేకుంటే తమ వినతి పత్రాన్ని కార్యాలయంలో సిబ్బందికి అందజేశామన్నారు. కాలనీలో చాలా వరకు చిన్న పిల్లలు ఉన్నారని, తమకు ఇద్దరు పిల్లలు ఉన్నారని దోమలు వ్యాప్తి చెందడంతో ఇప్పటికే డెంగీ బారిన పడినట్లు చెప్పారు. అయితే ఈ సమస్య గత ఏడాఇ కాలంగా ఉందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు. మున్సిపల్ కమిషనర్ సార్ తమ సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరుతున్నారు.



మురుగునీటిలో బర్రెలు సేదతీరుతున్న దృశ్యం

## అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన



పరిసరాలను పరిశీలిస్తున్న సిబ్బంది

**గోపాల్‌పేట ఆగస్టు23 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండలంలోని అనంతపురం గ్రామంలో జిల్లా నుండి వచ్చిన ఆంటీ లార్వల్ ఆపరేషన్ టీం సభ్యులు శుక్రవారం రోజు సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా డెంగ్యూ జ్వరం ఒకరి నుంచి మరొకరికి వ్యాపింప చేయుటలో ఆడ ఎడిస్ దోమ ప్రధాన పాత్ర పోషిస్తుందని, విటిని పులి దోమ అని కూడా అంటారని ఇవి పగులు, రాత్రి వేళ్లలో కూడా కొడుతాయని, ఈ దోమలు మంచినీటి పరిసరాలలో మాత్రమే నివసించును ముఖ్యంగా వారం రోజులపాటు నిలిచిన నీరు, కొబ్బరి చిప్పలు, పగిలిపోయిన సీసాలు, ప్లాస్టిక్ సంచులు, పాడైపోయిన టైర్లు మొదలగు వాటిలో గుడ్లు పెట్టి ఈ డెంగ్యూ జ్వరము హఠాత్తుగా వచ్చునని తీవ్రమైన జ్వరం, జ్వరంతోపాటు ఎముకలలో కండరాలలో భరించలేనంత నొప్పి శరీరంపై పొక్కులు దద్దుర్లు వాంతులు, వికారం వంటి లక్షణాలు కలిగిన ప్రాణాంతకమైన వ్యాధి అని తెలిపారు, కావున దోమలలో ఉన్న పరానజీవులు ఇతరులకు వ్యాప్తి చెందకుండా దోమలు నివారణ, నియంత్రణ చర్యలు చేపట్టవలెను కాబట్టి మన పరిసరాలలో అపరిశుభ్రంగా ఉన్న పనికిరాని చెత్తను వేరి పరేయాలని, పనికిరాని కుండలను గాని డబ్బాలు గాని ప్లాస్టిక్ కంటైనర్లు గాని వాటిపై మూత పెట్టి లేదా బోర్లించి పెట్టవలెనని, రోగం వచ్చిన తర్వాత బాధపడేకంటే రోగం రాకముందే తగిన జాగ్రత్తలు తీసుకుంటే మనము కిటకాల వలన అనగా దోమల వలన మలేరియా, డెంగ్యూ , చికెన్ గున్యా వంటి వ్యాధులను అరికట్టగలము కాబట్టి మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇది మనందరి కర్తవ్యం అని డాక్టర్ శివలీల గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ సిహెచ్ఓ, డాక్టర్ నాయక్ ఎంపీహెచ్ఓ, గ్రామ పంచాయతి కార్యదర్శి మహేష్, పాలమూరు మధుబాబు హెల్త్ అసిస్టేంట్, ఇతర వైద్య సిబ్బంది ఆశాలు అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకుల ధర్నా

### రామ్‌లింగప్పపై దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలి



రోడ్డుపై బైఠాయించిన ముదిరాజ్ నాయకులు

**నారాయణపేట టౌన్,ఆగస్టు 23 ప్రభాతవార్త:** పేట మండల పరిధిలోని జలాలప్‌పూర్ గ్రామానికి చెందిన రామ్‌లింగప్ప ముదిరాజ్‌పై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తా వద్ద ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు సరాఫ్ నాగరాజు, మిర్చి వెంకటయ్య మాట్లాడుతూ రోజు రోజుకు ముదిరాజ్‌లపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. జలాల్‌పూర్ గ్రామంలో ముదిరాజ్ రైతుపై ఇంత ఘోరంగా దాడికి పాల్పడడం దారుణమని అన్నారు. ఏకంగా రామలింగప్పను చంపడానికి ప్రయత్నం చేశారని చుట్టుపక్కల వారు ప్రాణాలు కాపాడారన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్టుచేసి తక్షణమే రిమాండ్‌కు తరలించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కుటుంబీకుల పెద్దలుద దాదాపు 30,35 సంవత్సరాల క్రితం కొన్న భూమిపై ఆనాడు అమ్మిన వారి వారసులు రెడ్డిలు పది సంవత్సరాల క్రితం కర్ణాటక కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కేసు నడుస్తుంది. కేసు రామలింగప్ప ముదిరాజ్ కుటుంబీకులకు అనుకూలంగా ఉంది. నెల రోజుల్లో తీర్పు రామలింగప్ప ముదిరాజ్‌కు అనుకూలంగా రాబోతుంది. విషయాన్ని గమనించిన ముందు వ్యక్తి హనుమాన్ ఆలయంలో రామలింగప్ప ముదిరాజ్ పూజలు నిర్వహిస్తుండగా, నారాయణరెడ్డి, లక్ష్మి, అక్షితరెడ్డి, అఖిలేష్ రెడ్డిలు కేసు ఓడిపోతున్నామని రామలింగప్ప ముదిరాజ్ కుటుంబంలో చదువుకున్న వారు ఎవరు లేకపోవడంతో రామలింగప్పను చంపితే ఆ మిగతా వారిని బెదిరించి కేసును తమవంక మలుపు తిప్పుకోవచ్చని ఆస్కా రం ఉంటుందని రామలింగప్పపై దాడికి పాల్పడ్డారు. అదే గ్రామానికి చెందిన బోయ కులస్తులు రక్షించి నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామలింగప్ప ముదిరాజ్ పరిస్థితి విషమించడంతో నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు మెరుగైన చికిత్సల నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోచికిత్స పొందుతున్నారు. ఈ విషయంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు.



బాధితున్ని పరామర్శించిన ఎర్రశేఖర్

**రామలింగప్పను పరామర్శించిన ఎర్రశేఖర్...**

మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామలింగప్పను మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ ముదిరాజ్ పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఎ.కాంత్‌కుమార్, ఎల్ఐసి గోవింద్, లక్ష్మికాంత్, కుటిమారి నర్సిములు, అపిడెపల్లి రాము, సంకలపురం చంద్రు, కతల్, కౌన్సిలర్, సంకలపురం మల్లేష్, పోషల్ రాజేష్, గొడుగు లక్ష్మణ్‌తో పాటు బిసి కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విశ్రాంత పీఈటి బి.గోపాలంకు ఘన సన్మానం

**మక్తల్,ఆగస్టు 23 ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన విశ్రాంత పీఈటి బి.గోపాలంను శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలో జరిగిన ఖోఖో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఖోఖో క్రీడల్లో ఆయన అందించిన విశేష సేవలకు గాను రాష్ట్ర మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్, మహబూబ్‌నగర్ ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ ఆయనను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాలరాజయ్య, రమేష్, నిరంజన్,భాస్కర్, వెంకటేష్, రూప, సత్య నారాయణ, తులసి, డి.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## తానే చంపేసి అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేసి..

మొదటి పేజీ తరువాయి భాగం..

అదేమి లేదని బెదిరించా నని కూతురిని నిమ్మించాడు. కానీ ఆ మరుసటి రోజే తిరిగి తన భార్యను పెద్ద కూతురు వద్దకు పంపించగా అక్కడికి వెళ్లలేదని, అక్కడికి వెళ్లలేదని తన భార్య కనిపించడం లేదని ఈనెల 20న జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేయించి కేసు దర్యాప్తు తప్పుదారి పట్టేలా చేశాడు. ఈ నేపథ్యంలో తన తల్లి అనిత విషయంలో తండ్రి విషయంలో కదలికలు అనుమానాస్పదంగా ఉన్నాయని పెద్ద కూతురు శ్వేత ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా విచారించిన పోలీసులు భర్త జంగిరెడ్డిని అదుపులోని విచారింగా అసలు విషయం వెలుగు చూసింది. తన భార్య అనితను తానే హత్య చేసి పోలెపల్లి లెదర్ పార్క్‌లోని డంపింగ్ యార్డ్ వద్ద శవాన్ని వదిలేసినట్లు ఒప్పుకున్నాడు. కుల్లిపోయిన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో రూరల్ సీఐ నాగార్జున గౌడ్, ఎస్సైలు శివానందగౌడ్, చంద్రమోహన్‌రావు పాల్గొన్నారు.

## జూరాల, నెట్టెంపాడు కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే

మొదటి పేజీ తరువాయి భాగం..

నియోజకవర్గంలో కేటిదొడ్డి మండల పరిధిలోని పాతపాలెం గ్రామంలో ఇటీవలే కురిసిన భారీ వర్షం కారణంగా పాతపాలెం నీలహళ్లి, గ్రామాలకు ప్రధాన రహదారిలో కాలువ తెగిపోవడంతో గ్రామస్తులకు రైతులకు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తెగిపోయిన కాల్వలను పరిశీలించడం జరిగింది.వెంటనే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండాలని అధికారులకు తాత్కాలికమైన రాకపోకలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు వెంకటన్న గౌడ్, ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## మళ్లీ మంచి రోజులు వచ్చాయి

మొదటి పేజీ తరువాయి భాగం..

ప్రకారం ఆరుగ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని మొదటిస్థానంలో నిలిపేందుకు ఎంతో కృషి చేస్తున్నామని, మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం ఎన్ని ఆటంకాలు ఎదురైనా ప్రజలకు అందించే ఉచిత పథకాలు అందిస్తూ, పేదల ఆత్మ గౌరవం పెంపొందిస్తున్నామని, మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ఇంకా సులభతరం చేయుటకు ఈ మధ్యనే కొత్తగా 1000 బస్సులు పెంచామని, రానున్న రోజుల్లో ఇంకా ఎక్కువ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన అప్పులు ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు తలకు మించిన భారంగా ఉన్నప్పటికి, 25 లక్షల కుటుంబాలను రైతు రుణమాఫీ ద్వారా రుణవిముక్తి చేసిన విషయం గుర్తు చేశారు. ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ప్రజలకు అందించే సంక్షేమ పథకాలకు ఏ ఆటంకం, లోటు లేకుండా ప్రజాపాలన కొనసాగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అందుకే మీరు కూడామాకు అన్ని విధాలా సహకారం అందించి మీకు అభయం ఇచ్చే కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలనిఆయన సూచించారు. అనంతరం లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్, బుద్దారం సుధాకర్‌రెడ్డి, నవనీత, శారద, జి.నర్సింలు, యాదిరెడ్డి, రామకృష్ణ, యాదన్న యాదవ్, రామకృష్ణ, వెంకటాద్రి, వెంకటయ్య,బొట్టు శ్రీను, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

**కోయిల్‌కొండ,ఆగస్టు 23 ప్రభాతవార్త:** 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా వందేమాతరం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో దేశభక్తి గేయాలను తెలంగాణ, ఆంధ్ర పాఠశాల స్థాయిలలో నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో మండలంలోని ఇబ్రహీంనగర్ యుపిఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో వారికి వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోళ్ల నరసింహులు తెలిపారు. దేశభక్తి గేయాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త రవిందర్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సువార్తమ్మ, సురెందర్‌రెడ్డి, పురెందర్‌రెడ్డి, పాండురంగం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైద్యంపై అవగాహన సదస్సు

**మహ్మదాబాద్,ఆగస్టు 23 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లో గల క్రౌన్ గార్డెన్‌లో జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్, గాంధీ గ్లోబల్ యోగ విద్యాలయ ఆధ్వర్యంలో జరగబోయే ప్రకృతి వైద్యంపై అవగాహన సదస్సును ఉమ్మడి గండీడ్ మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ట్రస్మా జిల్లా అధ్యక్షులు ఎన్.ప్రభాకర్, జిల్లా కార్యదర్శి అంజిరెడ్డి గాంధీ గ్లోబల్ ట్రస్టు అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎటిఆర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రకృతిని మించిన వైద్యశాల లేదని తెలిపారు. కార్యక్రమానికి ప్రకృతి వైద్య నిపుణులు డా. కె.వై. రాంచంద్రరావు, ఎన్వీ పద్మచే అవగాహన సదస్సు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ అధ్యక్షులుఅన్సర్,ఏటీఆర్ హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.